చెరువు కట్టలకు భద్రత ఏదీ?

- మరమ్మతులకు నోచుకోని చెరువులు
- కట్టలపై పెరిగిన ముళ్ల చెట్లు
- వానాకాలంలో వరదలు ముంచెత్తే అవకాశం


ఈదుకులపురం చెరువులో కట్టకు తాత్కాలిక పనులు చేసిన దృశ్యం (ఫైల్)


నల్లగొండ్రాయనపల్లి చెరువు కట్ట దుస్థితి

సోమందేపల్లి: చెరువులు భద్రంగా ఉంటే.. వర్షా కాలంలో నీరు నిండుగా చేరుతుంది.. చెరువుల కింద బోరుబావుల్లో భూగర్భజలాలు పెరుగుతాయి.. రైతులు పంటలు సాగు చేసుకోవడానికి వీలవుతుంది. అయితే నియోజకవర్గంలోని చెరువులు అభివృద్ధికి నోచుకోలేదు. దుస్థితికి చేరుకున్నా వాటిని పట్టించుకున్నవారులేరు. మరమ్మతులు చేయకపోవడంతో చెరువునీరు వృథాగా పోతోంది. కనీసం జంగిల్ క్లీనింగ్ పనులు కూడా చేపట్టలేదు.

నియోజకవర్గంలో దాదాపు 207 చెరువులు ఉన్నాయి. చెరువుల వద్ద కంపచెట్లు పేరుకుపోయాయి. మరువ ప్రాంతంలో కట్ట దెబ్బతిని నీరు లీకేజీ అవుతోంది. అక్రమంగా మట్టి తరలించేవారు ఇష్టారాజ్యాంగా జేసీబీల ద్వారా గుంతలు తవ్వి చెరువులను గుల్ల చేశారు. ఇరిగేషన్ శాఖ అధికారులు చెరువులను పర్యవేక్షించలేదు. కనీసం కన్నెత్తి చూడలేదని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు.

మరమ్మతులకు నోచుకోని చెరువులు..

నియోజకవర్గంలోని సోమవందేపల్లి మండలంలో నడింపల్లి, ఈదుకులపురం, పాపిరెడ్డిపల్లి, రొద్దం పెద్ద చెరువు, పరిగి చెరువు, గోరంట్ల మండలంలోని మాల్లాపల్లి చెరువులు దెబ్బతిన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు ఆయా చెరువుల్లో వృథాగా పోయింది. నియోజకవర్గంలో చాలా చెరువు కట్టలు నెర్రెలు చీలి, గండ్లుపడ్డాయి. జోరుగా వర్షాలు కురిసి మరువపారితే అవి తెగడం ఖాయమని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. కాలువల్లో చెట్లు విస్తారంగా పెరిగిపోవడంతో ఆయకట్టు రైతులు తమ పొలాలకు నీరు అందలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శాశ్వత మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు కొన్నిచోట్ల తూతూ మంత్రంగా చేసి, చేతులు దులుపుకుంటున్నారు.

సరిగా మరమ్మతులు చేయలేదు



వర్షాలు కురుస్తున్నాయి. చెరువులో నీరు నిల్వ ఉంది. చెరువు కట్టలు దెబ్బతిన్నాయి. గండి పడితే ఇసుక బస్తాలతో మరమ్మతులు చేస్తున్నారు. కానీ శాశ్వతంగా కట్ట మరమ్మతులు చేపట్టడం లేదు. ఇరిగేషన్ అధికారులు ప్రతి చెరువూ పరిశీలించాలి.

– రాజ్‌గోపాల్, సోమందేపల్లి

చెరువులు అభివృద్ధి చేయాలి



వచ్చిన వర్షాలకు చెరువులు నిండయి, అయితే కట్టలు భద్రంగా లేవు. ఇటీవల కురిసిన వర్షాలకు చాలా నీరు గ్రామ చెరువులలో వృథాగా పోయింది. ఇటీవల సాగు నీటి సంఘాల ఎన్నికలు జరిగాయి. ప్రభుత్వం నిదులు విడుదల చేసి తూముల మరమ్మతులు, కట్టలపై చెట్ల తొలగింపు చేపట్టాలి.

– బాబావలి, రైతు మల్లాపల్లి

సేవలతో ప్రజలకు చేరువకండి


నియోజకవర్గ సమన్వయకర్త దీపిక, వేణురెడ్డిని సన్మానిస్తున్న వివిధ అనుబంధ సంఘాల నేతలు

హిందూపురం: సేవలతో ప్రజలకు చేరువ కావాలని హిందూపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ టిఎస్.దీపిక వైఎస్సార్‌సీపీ శ్రేణులకు సూచించారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కొత్తగా నియమితులైన మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నాగమణి, బూత్ కమిటీల జిల్లా అధ్యక్షుడు వాల్మీకి లోకేష్, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు మహేష్ గౌడ్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మార్కెట్ చాంద్ తదితరులు దీపికతోపాటు పార్టీ నేత గుడ్డంపల్లి వేణురెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జబివుల్లా, వైఎస్సార్‌సీపీరాష్ట్ర కురుబ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌ఏ.శివ, కౌన్సిలర్లు ఆసీఫ్‌వుల్లా, మల్లికార్జున, రామచంద్ర, పట్టణ కన్వీనర్ మున్నూర్‌ఖాన్, సీఏన్‌పీ నాగరాజు, శ్రీరాంరెడ్డి, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్క్రాప్ వేలం

హిందూపురం టౌన్: పట్టణంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలోని స్క్రాప్ వస్తువులను శుక్రవారం ఆస్పత్రి ఆవరణలో బహిరంగ వేలం వేశారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింగన్న, ఆర్ఎంఓ డేవిడ్ రాజ్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుల సమక్షంలో వేలం జరిగింది. కేజీ ఐరన్ రూ.56, కేజీ ఉడ్ రూ.6, కాపర్‌కు రూ.760, ప్లాస్టిక్ రూ.30 చొప్పున పలికాయి. ఈ ఆదాయాన్ని ఆస్పత్రి అభివృద్ధికి వినియోగించనున్నట్లు సూపరింటెండెంట్ తెలిపారు.

క్లుప్తంగా

ముగిసిన ఆధార్ క్యాంపు


విద్యార్థికి ఆధార్ అప్‌డేట్ చేస్తున్న సిబ్బంది

లేపాక్షి: పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 17న ప్రారంభమైన ఆధార్ అప్‌డేషన్ క్యాంపు శుక్రవారం ముగిసింది. ఈ క్యాంపులో 230 మంది విద్యార్థులకు ఆప్‌డేట్ చేసినట్టు ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు తెలిపారు. ఎంపీడీఓ నరసింహమూర్తి, ఎంఈఓ నాగరాజు క్యాంపును పర్యవేక్షించారు. డిజిటల్ అసిస్టెంట్ శ్రీనివాసులు, బాబాద్దీన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి


చోళేమర్రిలో విద్యార్థులకు మోడల్ పేపర్లు పంపిణీ చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

రొద్దం: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితేనే ఉన్నత స్థాయికి చేరుకుంటారని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ అన్నారు. మండల పరిధిలోని చోళేమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన మోడల్ పేపర్లను శుక్రవారం విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసినట్లు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ సీనియర్ నాయకులు నారాయణస్వామి, మండల అధ్యక్షుడు సానిపల్లి గంగాధర్, గౌరవ అధ్యక్షుడు మరేష్, నాయకులు సత్యమయ్య, వెంకటేష్, రామాంజనేయులు, మాజీ సర్పంచ్ అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మండల పూజ

లేపాక్షి: పులమతిలోని అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం మండల పూజ కార్యక్రమ ఘనంగా జరిగింది. స్వామివారికి అభిషేకార్చనలు, మూలమంత్ర హోమాలు చేపట్టారు. సర్పంచ్ అశ్వత్థనారాయణ, గురుస్వామి వెంకటరామిరెడ్డి, జేకే.ప్రభాకర్, శ్రీనివాసరెడ్డి, అనిల్‌ఆచారి పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

పావగడ: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం శంకర కంటి ఆస్పత్రి, హెల్ప్ సొసైటీ సేవా ట్రస్ట్ సంయుక్తంగా కంటి వైద్య శిబి రం నిర్వహించారు. కంటి వైద్య నిపుణులు అనురాధ, మౌనిక కంటి పరీక్షలు చేశారు. 50 మందిని కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. మానం శశి కిరణ్, ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో ఏకాగ్రత


మెడల్స్, సర్టిఫికెట్లు అందుకున్న విజేతలు

హిందూపురం: క్రీడలతో ఏకగ్రత పెరిగి ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని గొల్లాపురం సర్పంచ్ దేవరాజు అన్నారు. సూర్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామంలో 10 రోజులపాటు జరిగిన క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. క్రికెట్‌లో గొల్లాపురం, వాలీబాల్ పోటీల్లో చౌళూరు బృందానికి ట్రోఫీ, మెడల్స్, సర్టిఫికెట్లు, నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఆదినారాయణ, సూర్య ఫౌండేషన్ ఇన్‌చార్జ్ శత్రుఘ్న, సూర్య రోష్ని లిమిటెడ్ హెచ్ఆర్ గ్యాన ప్రకాష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలి

పెనుకొండ రూరల్: మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని వైద్య ఉద్యోగులు ముక్తకంఠంతో నిరసన తెలియజేశారు. గురువారం గుట్టూరు పీహెచ్‌సీలోని మధ్యాహ్న భోజన విరామ సమయంలో హెల్త్ అసిస్టెంట్లకు మద్దతుగా నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ నాగరాజు నాయక్, ల్యాబ్ టెక్నీషియన్ తనూజ, నర్సులు, హెల్త్ అసిస్టెంట్లు మురళీ, కేశవ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

హెల్త్ అసిస్టెంట్ల ఆందోళన

సోమందేపల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద హెల్త్ అసిస్టెంట్లు ప్లకార్డులతో శుక్రవారం ఆందోళన చేశారు. కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న తమను ప్రభుత్వం తొలగించడం అన్యాయమన్నారు. అనంతరం వైద్యాధికారి హరికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు తిమ్మప్ప, శ్రీనివాసులు, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం వడ్డించాలి

రొళ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం వడ్డించాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఎం.రాయాపురం జిల్లా పరిషత్ ఉన్నత, ఎంఆర్ గొల్లహట్టి ప్రాథమిక, ఆవినకుంట కేజీబీవీ పాఠశాలలను సందర్శించారు. ఆయా పాఠశాలల్లో రికార్డులు తనిఖీ చేసి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ మున్వార్‌జాన్, ఉపాధాయులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి


సబ్‌జైలులో ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి రాజ్యలక్ష్మి

హిందూపురం: జైలు శిక్ష అనంతరం సత్ప్రవర్తనతో మెలగాలని జూనియర్ జడ్జి రాజ్యలక్ష్మి ఖైదీలకు సూచించారు. శుక్రవారం స్థానిక సబ్‌జైలును ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. సబ్ జైలుకు సరఫరా అవుతున్న ఆహార ధాన్యాల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఖైదీలతో ఆహారం, పరిసరాల శుభ్రత, ఏఏ కేసుల్లో అక్కడికి వచ్చారు, ఎప్పటి నుంచి శిక్ష అనుభవిస్తున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ తప్పు చేసి జైలుకు రావడం వల్ల ఆర్థిక, మానసిక ఇబ్బందులతో పాటు కుటుంబ మర్యాదలు దెబ్బతింటాయన్నారు. జైలు శిక్ష తర్వాత ప్రశాంత జీవనం గడపాలని సూచించారు. ఆర్థిక స్థోమత లేనివారికి ఉచితంగా న్యాయ సేవలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సబ్‌జైలు అధికారి హనుమన్న, న్యాయవాదులు సంతోషి కుమారి, కళావతి, ఈశ్వరప్ప, లోక్ అదాలత్ సిబ్బంది శారద తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి


సమన్వయకర్త ఈరలక్కప్పను సన్మానించిన ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి

గుడిబండ: మండల పరిధిలోని ఫళారం గ్రామంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్పను ఇటీవల వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన జమ్మానిపల్లి గ్రామానికి చెందిన నరసింహమూర్తి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈరలక్కప్పను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి మాట్లాడుతూ.. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, ప్రజా సమస్యలపై కలిసి కట్టుగా పోరాడుతానన్నారు. ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం సాగిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మూర్తి, ఎంపీటీసీ సభ్యుడు మలేరంగప్ప, నాయకులు హనుమంత రాయప్ప, నరేసేగౌడు, రంగనాథ్, బాషా తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు బిగించొద్దని ఆందోళన

అగళి: స్మార్ట్ మీటర్ల బిగించొద్దని మండల కేంద్రంలోని దుకాణాల యజమానులు శుక్రవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలురువు మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్లు బిగించిన తర్వాత ముందుగానే డబ్బులు చెల్లించి రీచార్జ్ చేయించుకోవాల్సి వస్తుందన్నారు. ఒకవేళ రీచార్జ్ చేయించుకోకపోతే విద్యుత్ సరఫరా నిలిచి పోతుందని తెలిపారు. పాత పద్ధతి ద్వారా బిల్లులు చెల్లిస్తామని పేర్కొన్నారు. ఉచిత విద్యుత్‌ను దశల వారీగా తొలగించడానికే ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల విధానాన్ని తీసుకొచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

జగన్ జన్మదిన వేడుకలకు తరలిరండి

మడకశిర: నియోజకవర్గ వ్యాప్తంగా శనివారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదిన వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు పార్టీ సమన్వయకర్త ఈరలక్కప్ప తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జన్మదిన వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

రొద్దం: మండలంలోని ఎం.కొత్తపల్లిలోని ఎస్సీ కాలనీలో వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ కన్వీనర్ బి.తిమ్మయ్య ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం కాలనీలో దుప్పట్ల పంపిణీ చేస్తామన్నారు.

పరిగి: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ అధినేత, పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను శనివారం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ నరసింహమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో నిర్వహించే కార్యక్రమానికి మండల వ్యాప్తంగా ఉన్న పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలన్నారు.

అమరాపురం: స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద శనివారం ఉదయం 10 గంటలకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్, ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క తెలిపారు. వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, మాజీ డీలర్లు, మాజీ ఫీల్డ్ అసిస్టెంట్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు అధిక సంఖ్యలో తరలి రావాలన్నారు.

అగళి: మండల కేంద్రంలో శనివారం ఉదయం 11 గంటలకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ స్టుడియో శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో పాటు ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.

రొళ్ల: మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద శనివారం ఉదయం 11:30 గంటలకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

గుడిబండ: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం మండల కేంద్రంలోని వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు తెలిపారు.

పెనుకొండ రూరల్: పట్టణంలోని మడకశిర రోడ్డులో శనివారం జరగనున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలకు తరలిరావాలని మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ నరసింహులు పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటలకు వైఎస్సార్ విగ్రహం వద్ద కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజా ప్రతినిధులు,వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులు, అనుబంధ విభాగాల నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

హిందూపురం: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించనున్నట్లు నియోజకవర్గ సమన్వయకర్త టీఎస్ దీపిక, నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి తెలిపారు. ఉదయం 9:30 గంటలకు కేక్ కటింగ్ ఉంటుందన్నారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం, ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని తెలిపారు.

హిందూపురం: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ జన్మదిన వేడుకలను శనివారం ఉదయం 9.30 గంటలకు టీచర్స్‌కాలనీలోని పార్టీ నేత నవీన్ నిశ్చల్ కార్యాలయంలో నిర్వహించనున్నారు. నాయకులు, అనుబంధ విభాగ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని నవీన్ నిశ్చల్ కోరారు.

లేపాక్షి: లేపాక్షిలోని వైఎస్సార్ విగ్రహం వద్ద శనివారం ఉదయం 9 గంటలకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ నారాయణస్వామి శుక్రవారం తెలిపారు.

వేంకటేశ్వర స్వామికి అభిషేకం


వేంకటేశ్వర స్వామి

రొళ్ల: కొత్తపాళ్యంలో వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవలు మొదలుకుని అంకురార్పణ, అభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, గోదాదేవి సమేతంగా వేంకటేశ్వర స్వామి మూల విగ్రహాలకు అభిషేకం చేపట్టారు. వెండి, పంచలోహ కవచాలతో పాటు పూలతో అలంకరణ చేసి మహామంగళ హారతి ఇచ్చారు.

తుమ్మల మారెమ్మకు పూజలు


తుమ్మలమారెమ్మ

గుడిబండ: పట్టణ సమీపంలోని తుమ్మల మారెమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, కుంకుమ అర్చనలు తదితర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వెండి, బంగారు ఆభరణాలతో పాటు వివిధ రకాల పూలతో అలంకరించి, మహామంగళారతి చేశారు

కేంద్ర హోం మంత్రి క్షమాపణలు చెప్పాలి

హిందూపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమీత్‌షా వెంటనే భారత జాతికి క్షమాపణ చెప్పాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద హోం మంత్రి వ్యాఖ్యలపై నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాతను అవమానిస్తే సహించేది లేదని హెచ్చరించారు. బీఎస్పీ నాయకులు శ్రీరాములు, జామియా మసీద్ ముతవల్లి నూరుల్లా, ఇసాక్, లైఫ్ వరల్డ్ చారిటబుల్ ట్రస్ట్ కన్వీనర్ ఉదయ్ కుమార్, మాజీ కౌన్సిలర్ రామ్మూర్తి, ముస్లిం నగారా నేత ఉమర్ ఫరూక్, క్రైస్తవ సంఘం నాయకులు మనోజ్, శ్యాంబాబు, అబ్రహం, మైనార్టీ నాయకులు జుబేర్, జబివుల్లా దళిత సంఘాల నేతలు క్రిష్టప్ప హరితకల్ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

అమరాపురం: గ్రామాల్లోని భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మారుతి ప్రకాష్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని హాలుకూరు గ్రామ సచివాలయంలో రెవెన్యూ సమస్యలపై గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో వీఆర్వో సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

లేపాక్షి: చోళసముద్రం రచ్చకట్ట వద్ద శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ సమస్యలపై ప్రజల నుంచి 50 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ సౌజన్యలక్ష్మి తెలిపారు. 45 రోజుల్లోపు దరఖాస్తులకు పరిష్కరిస్తామన్నారు. రెవెన్యూ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

రొళ్ల: రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి పేర్కొన్నారు. శుక్రవారం మల్లినమడుగు పంచాయతీ కేంద్రంలో గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ గిరియప్ప, సర్వేయర్ కిరణ్‌కుమార్, వీఆర్వో చిరంజీవి, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన రాయితీలు సద్వినియోగం చేసుకోండి

చిలమత్తూరు: ఉద్యాన శాఖలో రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన శాఖాధికారి మహేష్ నాయక్ రైతులకు సూచించారు. 30ఇంటూ20 అడుగుల ప్యాక్ హౌస్ యూనిట్ విలువ రూ.4 లక్షలు కాగా ఇందులో రూ.2 లక్షలు రాయితీ, 5వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల కోల్డ్ స్టోరేజీకి రూ. 4 కోట్లు కాగా.. అందులో రూ.1.40 కోట్ల రాయితీ ఉంటుందని పేర్కొన్నారు. పండ్లు మాగబెట్టే గదులు 20 మెట్రిక్ టన్నుల కెపాసిటీ రూ.20 లక్షలు కాగా రూ.7 లక్షల సబ్సిడీ, సోలార్ కోల్డ్ రూం 14 మెట్రిక్‌టన్నులు 12.50 లక్షలు కాగా 4.37 లక్షలు రాయితీ, శీతల వాహనం (9 మెట్రిక్ టన్నుల వాహనం) రూ.26 లక్షలు కాగా రూ.9.10 లక్షలు సబ్సిడీ అందిస్తున్నట్లు వెల్లడించారు. కమ్యూనిటీ ఫారంపాండ్ 1.50 లక్షలు కాగా అందులో రూ.75 వేల సబ్సిడీ, చిన్న తరహా పండ్ల మొక్కల నర్సరీ రూ.15 లక్షలు కాగా అందులో రూ.7.50 లక్షల సబ్సిడీ, మినిమల్ ప్రాసెసింగ్ యూనిట్ రూ.26 లక్షలు కాగా రూ.10 లక్షల మేర సబ్సిడీ వర్తింపజేస్తున్నట్లు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

మద్యం విక్రేత అరెస్టు

పెనుకొండ రూరల్: కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ సృజన్ బాబు మాట్లాడారు. మండ్లిలో ఎస్.మారుతీ తన ద్విచక్ర వాహనంపై 96 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను తరలిస్తుండగా, స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

24న చేపల చెరువు వేలం

మడకశిర రూరల్: హరేసముద్రం పెద్ద చెరువులో చేపల పెంపకానికి ఈ నెల 24న ఉదయం 10:30 గంటలకు గ్రామ సచివాలయంలో సర్పంచ్ కరియన్న అధ్యతన వేలం పాట నిర్వహిస్తున్నట్లు గ్రామ కార్యదర్శి అశ్వర్థ ఓ ప్రకటనలో తెలిపారు.

మిద్దెపై నుంచి పడి వ్యక్తికి గాయాలు

రొద్దం: మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన బోయ అక్కులప్ప కొడుకు నాగేంద్ర మిద్దెపై నుంచి కింద పడి తీవ్రంగా గాయపడినట్లు గ్రామస్తులు శుక్రవారం తెలిపారు. అతని తలకు బలమైన గాయమైందన్నారు. 108 వాహనంలో హిందూపురం ఆస్పత్రికి, అక్కడి నుంచి బెంగళూరుకు తరలించారు.

సమస్యలు పరిష్కరించాలి

మడకశిర: పట్టణంలోని వివిధ వార్డుల్లో నెలకున్న సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆదేశించారు. శుక్రవారం13, 19వ వార్డుల్లో పర్యటించారు. కమిషనర్ రంగస్వామి, ఏఈ మురళి పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

పావగడ: చలికి తట్టుకోలేక ఇబ్బందులు పడుతున్న 100 మంది పేద వృద్ధులు, బాలింతలు, చిన్నారులకు స్వామి జపానంద దుప్పట్లు,స్వెటర్లు పంపిణీ చేశారు. స్థానిక రామకృష్ణ సేవాశ్రమంలో శుక్రవారం స్వామి జపానంద స్వెటర్లు, ఉన్ని టోపీలు అందజేశారు. ఆశ్రమ భక్తులు బాలాజీ, భరత్ రామ్మూర్తి, వెంకటేశ్ ముకుంద, అశ్వథ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: ఆమిదాలగొంది వెంకటేశ్వర వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శుక్రవారం పావగడ తాలుకా నాగలమడకకు చెందిన మారుతి కుటుంబ సభ్యులు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించి పండ్లు అందజేశారు. కుమారుడు సుధీర్ జన్మదిన వేడుకలను వృద్ధుల మధ్య జరుపుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తత అవసరం

అగళి: డెంగీపై అప్రమత్తత అవసరమని మలేరియా సబ్ యూనిట్ అధికారి షమీవుల్లా, వైద్యాధికారి శివానంద సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో డెంగీ, మలేరియా నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారులు శివానంద, గాయిత్రి, పీహెచ్ఎన్ లక్ష్మీదేవి, సూపర్‌వైజర్ నరసారెడ్డి, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలందించండి

చిలమత్తూరు: రైతులకు మెరుగైన సేవలందించాలని అధికారులు రైతు సేవా కేంద్రాల సిబ్బందికి సూచించారు. శుక్రవారం రైతు సేవా కేంద్రంలో సామర్థ్యం పెంపుపై శిక్షణ తరగతులు నిర్వహించారు. డాట్ సెంటర్ అధికారి రామసుబ్బ య్య, ఏపీఎంఐపీ అధికారి సుదర్శన్, ఉద్యానవన అధికారి మహేష్ నాయక్, ఏడీఏ అల్తాఫ్‌ఖాన్ అవగాహన కల్పించారు. ఏఓ వంశీకృష్ణ, సెరికల్చర్ అధికారి రమణారెడ్డి, వ్యవసాయ వన రుల కేంద్రం ఏడీ సనావుల్లా, డివిజన్‌లోని ఏఓలు మునికృష్ణ, సురేంద్రనాయక్, శ్రీలత, విజయభారతి, ఏఈఓలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

హిందూపురం: పట్టణంలో 11 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు డీఆర్ కాలనీ, డీబీ కాలనీ, లక్ష్మీపురం, శ్రీకంఠపురం మోడల్ కాలనీ, నానెప్ప నగర్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో డీ-1 అధికారులు తెలిపారు. అలాగే 33/11 కేవీ హిందూపురం విద్యుత్ ఉపకేంద్రం నుంచి వెళ్తున్న 11 కేవీ మోదా ఫీడర్ లైను మెయింటెనెన్స్ కోసం శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు డీ-2 అధికారులు పేర్కొన్నారు. డీ-2 పరిధిలోని రాగా రెస్టారెంట్, శిల్ప నర్సింగ్ హోమ్ రోడ్డు, బాలాజీ నగర్, ధన్‌రోడ్డు, సదాశివనగర్, అహ్మద్ నగర్, సత్యసాయినగర్, వెంకటేశ్వర నగర్, విజయనగర కాలనీ, భాగ్యనగర్, ముదిరెడ్డిపల్లి శివబాల యోగి స్వామి ఆశ్రమ పరిసర ప్రాంతం, అరవింద్ నగర్, సడ్లపల్లి, ఎన్టీఆర్ కాలనీ, ఆటోనగర్, మూసానగర్, వీవర్స్‌కాలనీ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.